# ఎన్నికలకు సర్వం సిద్ధం

- గ్రామాలకు చేరుకున్న ఈవీఎం, వీవీప్యాట్‌లు, సిబ్బంది
- ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్



ఎన్నికల సామగ్రిని పరిశీలిస్తున్న పోలింగ్ సిబ్బంది



ఈవీఎం మిషన్లను పరిశీలిస్తున్న రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రీతమ్ సింగ్

కల్వకుర్తి రూరల్, నవంబర్ 29: గురువారం జరగనున్న శాసనసభ ఎన్నికలకు ఎన్నికల యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. గురువారం కల్వకుర్తి పట్టణంలోని సీబీఎం కళాశాల నుంచి నియోజకవర్గంలోని మండలాలకు పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది, ఈవీఎం, వీవీప్యాట్‌లను తీసుకుని వెళ్లారు. బుధవారం ఉదయం 9గంటల నుంచి ఆర్‌వో శ్రీను ఆధ్వర్యంలో ప్రతి పోలింగ్ సిబ్బందికి పోలింగ్ నిర్వహించేటప్పుడు పాటించాల్సిన నియమాలు, సలహాలు సూచనలు జారీ చేశారు. ఆరు మండలాల్లో మొత్తం 262 పోలింగ్ కేంద్రాలకు పోలింగ్ యంత్రాలను తరలించారు. గురువారం ఉదయం ఆరు గంటల నుంచి 7గంటల వరకు ఈవీఎంల మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని సిబ్బంది నిర్వహించిన అనంతరం గ్రామస్తులు ఓటు వేసేందుకు అనుమతించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నియమావళి ప్రకారం సిబ్బంది నడుచుకోవాలని ఎన్నికల నియమావళికి విరుద్ధంగా వ్యవహరిస్తే కఠినంగా చర్యలు తీసుకుంటామని అధికారులకు తెలిపారు. ఈవీఎంలు మొరాయిస్తే వెంటనే సంబంధిత ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల పనితీరు సిబ్బంది చేయాల్సిన విధులను ప్రొజెక్టర్ ద్వారా అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ విధానం తెలుసుకునేందుకు వెబ్‌క్యామ్‌ల ద్వారా పర్యవేక్షించనున్నట్లు దీనికై ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఎన్నికల కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఓటు వేసేందుకు వెళ్లే ప్రతిఒక్కరూ ఏదేని గుర్తింపు కార్డుతో (ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్, ఓటర్ ఐడీ, ఈజీఎస్ జాబ్ కార్డు) పోలింగ్ స్లిప్‌తో పాటుగా కేంద్రానికి వెళ్లాలన్నారు. ఓటర్లు పోలింగ్ సిబ్బందికి సహకరించాలని కోరారు. ఎన్నికల సామగ్రి తరలింపు కేంద్రాన్ని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రీతమ్ సింగ్ పరిశీలించారు. ఎన్నికల సిబ్బందికి అందించిన సామగ్రిని పరిశీలించి వారితో మాట్లాడారు. పోలింగ్ కేంద్రం వద్ద ఏవైనా సమస్యలు తలెత్తితే వెంటనే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికలను అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ పార్థసారథి, పోలీస్ సిబ్బంది ఆయాశాఖల అధికారులు ఉన్నారు.



పోలింగ్ సిబ్బందిని గ్రామాలకు తరలించేందుకు కల్వకుర్తిలో సిద్ధంగా ఉన్న వాహనాలు

# పోలింగ్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

- బ్యాలెట్ బ్యాక్సులను గమ్యం చేరవేయాలి
- పోలింగ్ ప్రక్రియకు ఇబ్బందులు కలుగకుండా బందోబస్తు చేయాలి
- పోలీస్ సిబ్బందికి సూచనలు చేసిన పోలీస్ ఉన్నతాధికారులు

కల్వకుర్తి, నవంబర్ 29: బ్యాలెట్ బ్యాక్సుల పంపిణీ, పోలింగ్ అనంతరం తిరిగి బ్యాలెట్ బ్యాక్సులు గమ్యస్థానాన్ని చేరే వరకు పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఎస్పీ రాజేందర్‌రెడ్డి చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గానికి సంబంధించి స్థానిక సీబీఓం కళాశాలలో ఏర్పాటు చేసిన బ్యాలెట్ డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఎన్నికల విధులు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులకు సిబ్బంది సమావేశాన్ని ఏర్పాటు చేశారు. సమావేశంలో డీసీపీ నారాయణరెడ్డి, ఎన్నికల ఇన్‌చార్జి ఎస్పీ రాజేందర్‌రెడ్డి మాట్లాడారు. పోలింగ్ ప్రక్రియకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. కల్వకుర్తి నియోజకవర్గం పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు ఒక డీఎస్పీ, 8 మంది సీఐలు, 14 మంది ఎస్సైలు,416 మంది పోలీసులతో పాటు రెండు కంపెనీల(206 మంది) సీఆర్‌పీఎఫ్ బలగాలను ఎన్నికల కమీషన్ కేటాయించిందని వారు చెప్పారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినా వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎన్నికల నిబంధనల ప్రకారం నడుచుకోవాలని చెప్పారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.




ఎన్నికల విధులపై పోలీసులకు సూచనలు చేస్తున్న పోలీస్ ఉన్నతాధికారులు



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

## 35 కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తి



ఆమనగల్లులో పోలింగ్ కేంద్రాలకు సామగ్రితో వస్తున్న పోలింగ్ సిబ్బంది

ఆమనగల్లు, నవంబర్ 29: నేడు (గురువారం) అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండలంలోని 13గ్రామ పంచాయతీలు, 1 మున్సిపాలిటీలో కలిపి 35 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని ఆ పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాటు పూర్తయినట్లు అసిస్టెంట్ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారి లలిత తెలిపారు. మండలంలో మొత్తం 31,190 మంది ఓటర్లు ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. మున్సిపాలిటీలోని అన్ని పోలింగ్ కేంద్రాలను ఆమనగల్లు మున్సిపల్ కమిషనర్ శ్యామ్‌సుందర్ సందర్శించారు. ఎలక్షన్ నేపథ్యంలో పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఓటింగ్‌కు పకడ్బందీ ఏర్పాట్లు



వెల్దండలో పోలింగ్ సామగ్రి తీసుకుంటున్న అధికారులు

వెల్దండ, నవంబర్ 29: నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. మండలంలో 35 పోలింగ్ బూత్‌లు, 33,039వేల మంది ఓటర్లు ఉన్నారు. వెల్దండ మండలం కొట్రలో 124 బూత్ మోడల్ పోలింగ్ కేంద్రం, మండల కేంద్రంలోని 151వ కేంద్రం మహిళల మోడల్ పోలింగ్ కేంద్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అధికారులు దగ్గరుండి సిబ్బందికి, పోలింగ్‌కు ఏర్పాట్లు చేశారు. అలాగే పోలింగ్ కేంద్రాల వద్ద గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈవీఎం బాక్సులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో తాసీల్దార్ రవికుమార్, డీటీ శ్రీనివాస్, లాజిస్టిక్ ఎన్నికల అధికారి ఫయాజ్, గిరిగౌడ్ తదితరులు ఉన్నారు.

**కడ్తాల్ మండలంలో..**

కడ్తాల్, నవంబర్ 29: మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో గల 35 పోలింగ్ కేంద్రాల్లో ఒక కేంద్రాన్ని చరికొండ నుంచి పల్లెచెల్కతండాకి మార్చినట్లు తాసీల్దార్ ముంతాజ్ తెలిపారు. మండలంలో మొత్తం ఓటర్లు 33,939 ఓటర్లు ఉండగా, అందులో పురుషులు 17,478 మంది, స్త్రీలు 16,460 మంది, ఇతరులు ఒకరు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు.

## మైసిగండిలో వైభవంగా పెద్ద రథోత్సవం



ఆలయ ఆవరణలో తేరు లాగుతున్న భక్తులు, యువకులు

కడ్తాల్, నవంబర్ 29: మైసిగండి మైసమ్మ అమ్మవారి జాతర ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం ఉదయం అమ్మ వారికి ప్రత్యేక పూజల అనంతరం భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. సాయం త్రం పెద్ద రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించిన తేరులో అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఉంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిసరాల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా మైసమ్మతల్లి నామస్మరణతో ఆ ప్రాంతం మార్మోగింది. తేరును లాగడానికి యువకులు, భక్తులు పోటీ పడ్డారు. పోలీసులు బందోబస్తును ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో స్నేహలత, ఆలయ చైర్మన్ శిరోలీపంతూనాయక్, సర్పంచ్ తులసీరాంనాయక్, ఆలయ నిర్వాహకులు భాస్కర్‌నాయక్, అరుణ్‌కుమార్, ఆలయ అర్చక సిబ్బంది యాదగిరిస్వామి, బోడియనాయక్ పాల్గొన్నారు.